## స్నేహ ఆధ్వర్యంలో పేదలకు రగ్గులు పంపిణీ

**విశాలాంధ్ర-శృంగవరపుకోట :** స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శృంగవరపుకోట పుణ్యగిరి లో ఉన్నటువంటి 30 మంది రిక్షా కార్మికులు చలికాలం సందర్భంగా రగ్గులు మరియు స్వీట్లు సంస్థ అధ్యక్షులు ఏ ఎస్ వెంకట్రావు అధ్యక్షతన పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగులు ఎం భాస్కర రావు మరియు ఎస్ ఈశ్వరరావు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, సెక్రెటరీ మంథా సుబ్బారావు, డాక్టర్ త్రినాదరావు, %మీాచీ% మూర్తి, శ్రీరామ్మూర్తి, మురళి, ప్రకాష్, రమేష్, దేముడు, శ్రీనివాసరావు, మదు, ప్రసాద్, అప్పలరాజు మరియు కోశాధికారి గణేష్, కె. శ్రీను, ప్రవీణ్,డాక్టర్ పొట్నూరు శ్రీరాములు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ

### రైతుకు అన్నివిధాలా అండగా నిలబడతాం

### పౌర సరఫరాల శాఖామంత్రి నాదేండ్ల మనోహర్

**విశాలాంధ్ర-డెంకాడ:** రైతుకు అన్ని విధాలా అండగా నిలబడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. ఆయన డెంకాడ మండలం చందకపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, రవాణా, నగదు జమ, ఇతర సమస్యలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడించి వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను దుర్మార్గంగా మోసం చేసిందని, సుమారు రూ.1674 కోట్ల ధాన్యం డబ్బులు బకాయి పెట్టిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ బకాయిలన్నిటినీ పూర్తిగా చెల్లించిందని చెప్పారు. సుమారు ఆరు నెలలపాటు కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందించాలన్నది ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ధ్యేయమని, దీనికి అనుగుణంగానే ధాన్యం సేకరణ ప్రక్రియను రూపొందించామని తెలిపారు. గతంలోలా కాకుండా రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించవచ్చునని సూచించారు. తేమ 17 శాతం వరకు అనుమతి ఉందని, 5 కిలోలు అదనంగా తీసుకొని, తేమ 24 శాతం వరకు ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో కేవలం 9,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగ్గా, ఈ ఏడాది 78వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని మంత్రి చెప్పారు. 24 గంటల్లోనే సుమారు 16000 మంది రైతులకు రూ.174 కోట్లు చెల్లించామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం చేయలేదని, ట్రాక్టర్లు, డ్రయ్యర్లు, కనీసం టార్పాలిన్లు సైతం ఇవ్వలేదని అన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సుమారు 2000 టార్పాలిన్లను రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 32 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ఈ ఏడాది లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 13,24,000 టన్నులను సేకరించామన్నారు. వాతావరణ పరిస్థితి అనుకూలంగా లేని సమయంలో రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ, వరికోతలు చేయకుండా ఉండాలని, ధాన్యం తడిచిపోకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా, ఏఐ టెక్నాలజీతో ట్రక్‌షీట్లను రూపొందిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి పెంచేందుకు వ్యవసాయాధికారులు రైతులకు సలహాలను అందించాలని మంత్రి కోరారు నెల్లిమర్ల ఎంఎల్‌ఏ లోకం నాగ మాధవి మాట్లాడుతూ, ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడటంతో జిల్లాలో మంచి ధాన్యం దిగుబడి వచ్చిం దని చెప్పారు. రైతులకు అనుకూలంగా సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం సేకరణ మొదలు పెట్టామని తెలిపారు. తమ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు లేక, బోర్లు పైనే వ్యవసాయం సాగుతోందని, ఏడాదికి ఒక పంట మాత్రమే పండిస్తున్నారని చెప్పారు. సాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, ఈ నెల 10,11,12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో, రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, గోనె సంచులు, వాహనాలతోపాటు, లేబర్‌ను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని, కొనుగోలు కేంద్రాలకు మాత్రమే ధాన్యం తరలించాలని జెసి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, డిఎస్ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనా కుమారి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు నాలుగు మండలాల తాసిల్దార్లు, ఎంపిడిఓలు, వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా అందని మంచినీరు...

### నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

**విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్:** శృంగవరపుకోట మండలం కొట్టాం పంచాయతీ బందారు వారి కళాలు గ్రామానికి ఆరు నెలలుగా మంచినీరు అందడం లేదని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు సుమారు 40 నివాసాలు ఉన్న ఆ గ్రామానికి ఆరు నెలల నుండి మంచినీటి బోరు పోవడంతో, గొట్టాలు ఇరిగిపోవడం వల్ల నీరు రావడం లేదని, ఆరు నెలల కాలం నుండి గ్రామస్థాయి అధికారుల నుండి మండల స్థాయి అధికారుల వరకు తెలియజేసినప్పటికీ కనీసం మా గ్రామాన్ని పట్టించుకోవడంలేదని మా గ్రామానికి మంచినీరు అందించడం లేదని రూరల్ వాటర్ సప్లై అధికారులకు పట్టణాలలో ఉండే శ్రద్ధ పల్లెటూర్ల మీద లేదని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని చెప్పుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మా గ్రామం పై చిన్నచూపు చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో త్రాగడానికి మరియు వాడుకలకు నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని వాపోయారు కనీసం మా గ్రామాన్ని మండల స్థాయి అధికారులు వచ్చి చూసి మంచినీరు సక్రమంగా అందించే విధంగా చూడాలని ఈ సందర్భంగా మొరపెట్టుకుంటున్నారు.

## రెవిన్యూ సదస్సుల్లోనే వినతులు సమర్పించాలి

### కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

**విశాలాంధ్ర-విజయనగరం:** రెవిన్యూ సమస్యల కోసం ప్రజలు రెవిన్యూ సదస్సుల్లోనే తమ వినతులను సమర్పించాలని, కలెక్టరేట్ వినతుల విభాగానికి రానవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. రెవిన్యూ సదస్సుల్లో వినతులను గ్రామ సభల్లోనే చదివి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని, వాస్తవ పరిస్థితుల్ని వివరించి ప్రజల ముందే సమాధానం చెప్పడం జరుగుతుందని తెలిపారు. కావునా ప్రజలు వ్యవ ప్రయాసలకోర్చి, సమయాన్ని వృధా చేసుకొని కలెక్టరేట్ కు రానవసరం లేదని, రెవిన్యూ సదస్సుల్లోనే చక్కటి పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేసారు. ఈ సోమవారం పిజిఆర్ఎస్ లో రెవిన్యూ కు సంబంధించిన వినతులు సగం తగ్గాయని, వచ్చే సోమవారానికి పూర్తిగా తగ్గాలని , మండల, గ్రామ స్థాయి లోనే పరిష్కారం చేసుకోవాలని తెలిపారు.

## కరాటే లో శ్రీ చైతన్య విద్యార్థినికి ఉత్తమ బహుమతి

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** శ్రీ చైతన్య విద్యాసంస్థ నిరంతరం విద్యతో పాటు ప్రతి విద్యార్థి యొక్క సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతుందని అందులో భాగంగానే కరాటే లో కూడా ఉత్తమ ప్రతిభను కనబరిచేందుకు విద్యార్థినీ విద్యార్థులకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తున్నామని శ్రీ చైతన్య విద్యా సంస్థ ప్రాంతీయ పర్యవేక్షకులు వి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రింగ్ రోడ్ లో గల శ్రీ చైతన్య పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న గేదెల తన్మయశ్రీ కి విజయనగరం కరాటే అసోసియేషన్ లో జరిగిన ఇండివిద్యువల్ ఛాంపియన్షిప్ లో రెండు ఉత్తమ బహుమతులను గెలుచుకున్నదని కోచ్ తాతారావు ను అభినందిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ బాబు తెలియజేశారు. ఇంతటి ప్రతిభను కనబరిచిన విద్యార్థినిని పాఠశాల వైస్ ప్రిన్సిపల్ విక్రమ్, పాఠశాల పీఈటీలు పాఠశాల డీన్లు సూర్యచంద్ర, సత్యనారాయణ, చిన్నం నాయుడు అభినందిస్తూ ఈ విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

## శివకరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ

**విశాలాంధ్ర -రాజాం:** ఈనెల 8న విజయ నగరం రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన కరాటి పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీల్లో రాజాం పట్టణానికి చెందిన శివ కరాటే అకాడమీ రేగాన శివ మాస్టర్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో 1. రేగాన అభిషేకం (ది సన్ స్కూల్) (టీవై) కాటా (గోల్డ్ మెడల్), 2 బత్తుల నవనీత్ (టీవై) కాటా, కుమితా (గోల్డ్ మెడల్), 3. వుండ్ల మోహిత్ (13) కుమితి (బ్రాంజ్ మెడల్) ను సాధించారు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి జిల్లా క్రీడాధికారి (డి.ఎస్.డి.ఓ) చేతులు మీదుగా మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకున్నారు. కరాటే మాస్టర్ శివ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

## వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి

### కమిషనర్ పల్లి నల్లనయ్య

**విశాలాంధ్ర -విజయనగరం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 2 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు వినతులు వచ్చాయి. వీటిని స్వీకరించిన కమీషనర్ సమస్యల పరిష్కారానికై ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి,అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు,ఈఈ టి.రాయల్ బాబు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

**విశాలాంధ్ర -రాజాం:** రాజాం మున్సిపాలిటీ పరిధి బొబ్బిలి రోడ్డులో తాగునీటి పైపులైను లీక్ అవుతు తాగు నీరు వృథా కావడంతో మంగళవారం మరమ్మతులు చేయనున్న కారణంగా నేడు కొన్ని ప్రాంతాలకు తాగునీటిని పంపిణీ అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు తెలిపారు. ఈ కింది ప్రాంతాలు అంటే వస్త్రపురి కాలనీ, అమ్మవారి కాలనీ, ఎస్సీ మెంతిపేట కాలనీ, మల్లయ్య పేట, బొబ్బిలి రోడ్డు, కాలేపు వీధి, చెగిడి వీధి, లచ్చయ్య పేట, మల్లికార్జున కాలనీ, మేధర వీధి, కంచర వీధిల్లో తాగునీటి పంపిణీ అంతరాయం కలుగు తున్నందున ఈ కొన్ని ప్రాంతాలలో మున్సిపాలిటీ ట్యాంకర్లతో మంచినీరు సప్లై చేయడం జరుగుతుందని కమిషనర్ జె.రామ అప్పల నాయుడు తెలిపారు.

## త్రిదండి చిన్న జీయర్ స్వామి చే పుస్తకావిష్కరణ

**విశాలాంధ్ర -భోగాపురం:** మిరాకిల్ కళాశాలలో త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా సోమవారం డాక్టర్ చల్లా త్రినాథ రావు రచించిన ద ఆర్ట్ ఆఫ్ స్ట్రెస్ రిలీఫ్ ఏసియన్షియల్ టిప్స్ ఫర్ ఎగ్జాం ప్రెజర్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జీవితం యొక్క ప్రతీ దశలోనూ ఒత్తిడి చిత్తూ చేస్తుందని,ఒత్తిడి ని జయించిన వారే విజేతలు కాగలని జీయరు స్వామి ఈ పుస్తకాన్ని ఉద్దేశిస్తూ అభిప్రాయం వ్యక్తం చేసారు. అలాగే ఇలాంటి పుస్తకాలూ ఇప్పటి తరానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ పుస్తకాన్ని రచించిన మిరకిల్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఎంబీఏ విభాగం అధిపతి అయిన డాక్టర్ చల్లా త్రినాథ రావును అభినందిస్తూ మంగళాశాసనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మిరాకిల్ సంస్థ సీఈవో లోకం ప్రసాద్ ,కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ అర్జున్ రావు, కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాసరావు బెహరా పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికే గ్రామ సదస్సులు

### స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ

**విశాలాంధ్ర-దత్తిరాజేరు :** రెవెన్యూ భూ సమస్యలు పరిష్కారానికే గ్రామ సదస్సులని గడసాం, ఏం లింగాలవలస గ్రామ సచివాలయాల వద్ద సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ మాట్లాడారు. తమ గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను అధికారు లకు వినతిరూపంలో తెలియజేయాలన్నారు. అనంతరం రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వారి భూముల సమస్యలను తెలియజేసారు వాటిని 45 రోజులలోగా పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శాంతి కుమారి, ఇంచార్జ్ తహసీల్దార్ వరప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు నిధులొచ్చాయ్...

### ఖాతాల్లోకి ఆర్థిక సంఘ నిధులు విడుదల

### జామి మండలానికి రూ.2.12కోట్లు మంజూరు

**విశాలాంధ్ర-జామి:** పంచాయతీలలో నిధులు లేక నీరసించిన పాలక వర్గాలకు కూటమి ప్రభుత్వం నిధుల వరద కురిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక ఏడాదికి సంభందించి మొదటి త్రైమాసికంలో నిధులు విడుదలచేసి ఆదుకునేందుకు సిద్ధమయింది. అందులో భాగంగా ఆయా పంచాయతీల ఖాతాలలో నిధులను జమచేసింది. గత ప్రభుత్వంలో పేరుకు నిధులు విడగుదల చేసినా వాటిని ఇతర పథకాలను మళ్లించే వారు. దీంతో పంచా యతీలలో ఏపనీ చేయలేక పాలకవర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. తాజాగా నిధులను ఆయా పంచాయతీల ఖాతాలకు వేయడంతోపాటు వెంటనే ఖర్చు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో అటు పాలక వర్గాలు, ఇటు కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### జామిమండలానికి రూ.2.12 కోట్లు మంజూరు..

ఆర్థిక సంఘం నిధులలో భాగంగా మండలంలోని 25 పంచాయతీలకుగాను మొత్తం రూ.2కోట్ల 12 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు ఒక్కో పంచాయతీకి రూ.50వేలనుంచి 5లక్షల వరకు నిధులు మంజూరుఅయ్యాయి. వీటిని టైడ్ అన్‌టైడ్ ఫండ్స్ కింద వినియోగించాల్సి ఉంది. టైడ్‌లో భాగంగా ఓడిఎఫ్ నిర్వహణ, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా వంటి పనులకు ప్రాదాన్యత ఇవ్వాలి. అలాగే అన్‌టైడ్ నిధులను పది శాతం విద్యుత్ బకాయిలకు చెల్లించాలి, వీధి లైట్లు, కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు, ఇతర సామాగ్రి కొనుగోలుకు, ప్రభుత్వ పాఠశాల భవనాల మరమ్మతులకు, ఆట స్థలాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

### పంచాయతీలలో ఆనందం..

గతంలో గ్రామాలలో అనేక పనులకు హామీలు ఇచ్చిన పాలక వర్గాలు నిధులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు పనులు చేసినా నిధులు రాకపోవడంతో చేతి చమురు వదిలించుకున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయోఅని ఎదురు చూసేవారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలంటే వాటికి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయం తీసుకోవడంతో పాలకవర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. మరో విశేషం ఏంటంటే ప్రస్తుతం ఉన్న పంచాయతీల పాలకవర్గాలలో అత్యధికంగా వైసీపీ మద్దతు దారులే సర్పంచ్‌లుగా ఉన్నారు. అయినా పంచాయతీలను దృష్టి పెట్టుకుని నిధులను విడుదల చేయడం జరిగింది. అధికారం చేపట్టిన రెండు నెలలకే కూటమి ప్రభుత్వం గతేదాది చివరి త్రైమాసిక నిధులను విడుదల చేసింది. తాజాగా ఈఆర్థిక ఏడాదికి సంభందించిన మొదటి త్రైమాసిక నిధులను విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతం నిధులు రావడంతో పంచాయతీలలో అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నారు.

## రెవెన్యూ సదస్సుకు 27 దరఖాస్తులు

### తహసిల్దారు రాములమ్మ

**విశాలాంధ్ర-వేపాడ:** మండలంలోని దబ్బిరాజుపేట, కరకవలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 27 దరఖాస్తులు రైతుల నుండి అందాయని తహసీల్దారు జే.రాములమ్మ తెలిపారు.ఈ మేరకు దబ్బిరాజుపేట గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కోరుకు 17 దరఖాస్తులు అందాయని అలాగే కరకవలస గ్రామానికి చెందిన10 మంది రైతుల నుండి పోతి కేసు, పట్టాదారు పాసు పుస్తకాలు ఆన్లైన్ కొరకు దరఖాస్తులు అందినట్టు తహసిల్దార్ తెలిపారు. ఈ సదస్సులకు మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీ తాసిల్దార్ కే. సన్యాసినాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, వీఆర్వోలు డి ప్రసాద్, జి శ్రీనివాస్, ఎం.ఈశ్వరరావు, గ్రామ పెద్దలు కోన సత్య రావు, దండుపాటి సత్తిబాబు, ఎర్ర ప్రగడ సూర్యం, దుల్ల అప్పన్న దొర, రైతులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలను తక్షణమే చట్టపరిధిలో పరిష్కరించాలి

### జిల్లాఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకుప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ సోమవారం నిర్వహించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 27 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 9, కుటుంబ కలహాలకు సంబం ధించినవి 1, మోసాలకు పాల్పడినట్లుగా 5, ఇతర అంశాలకు సంబంధించినవి 12 ఫిర్యాదులు ఉన్నాయ న్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సంరక్షించవలసినవారే వేధిస్తుంటే..

- నరకం చూస్తున్న వసతిగృహ విద్యార్థినిలు

- తట్టుకోలేక తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు

**విశాలాంధ్ర-కొత్తవలస(జామి) :** వారంతా దూర ప్రాంతాలనుంచి ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటూ విద్య నేర్చుకుందామని ఎంతో ఆశగా వచ్చారు. వారికి ప్రభుత్వ పరంగా రక్షణగా ఉండి, వారి బాగోగులు చూడాల్సిన సంరక్షురాలే తన భర్తతో కలిసి విద్యార్థినిలను వేదిస్తుంటే ఏళ్ళ తరబడి భరించారు. కానీ చివరకు తట్టుకోలేక ఈభార్యాభర్తల భాగోతాన్ని అధికారులకు ఫిర్యాదు చేసారు. కొత్తవలస మండల కేంద్రంలో ఉన్న బిసి బాలికల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు సోమవారం నేరుగా తహశీల్దార్ వద్దకు, పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ వార్డెన్ నీరజాకుమారిపై ఫిర్యాదు చేసారు. ఆమె విదులకు నచ్చినప్పుడు వచ్చి, మద్యం తాగి ఇష్టానుసారంగా మమ్మల్ని వేదిస్తున్నారని, ఆమెభర్త వసతిగృహంలో మమ్మల్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లైంగిక వేధింపులకు గురవుతున్నామని వారంతా ఏకరువు పెట్టారు. అంతేకాక తమకు ఆహారం సక్రమంగా పెట్టడంలేదని, హాస్టల్‌కు వచ్చిన సరుకును అమ్ముకుంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈదుర్మార్గాలను భరించలేక ఫిర్యాదు చేస్తున్నామని, తమను రక్షించాలని వారంతా అధికారులను, పోలీసులను కోరారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, ఆమె భర్తను శిక్షించాలని కోరారు. అలాగే తమను ప్రస్తుతం ఉన్న వసతి గృహంనుంచి పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న వసతి గృహానికి మార్పు చేయాలని కోరారు. విద్యార్థినిలు ఫిర్యాదు చేసిన విషయం మండలంలో సంచలనంగా మారింది. దీనిపై అధికారులు ఏవిదంగా స్పందిస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# అదానీ అక్రమాలపై ఎందుకు విచారణ జరపడం లేదు...

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ




**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** అదానీ అక్రమాల పై ఆధారాలు ఉన్నా ఎందుకు విచారణ జరపకపోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చూపడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. సోమవారం సిపిఐ దేశ వ్యాపిత పిలుపులో భాగంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో అమర్ భవన్ నుంచి ర్యాలీగా వెళ్ళి విజయనగరం ఆర్టీసి కాంప్లెక్స్ దగ్గర మానవహారం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మీడియాలో మాట్లాడుతూ అదానీ గ్రూపు కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహిం చడంలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందని తెలిసిన ఎందుకు దర్యాప్తు జరపడం లేదని ప్రశ్నించారు. అందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, మణిపూర్లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం (పిఎఫ్ఎస్పీఎ) ఉపసంహరించాలని అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగం నిర్మూలించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. జిడిపి తగ్గిపోవడంపై ఎవ్వరూ నోరు మెదపడం లేదని మండిపడ్డారు. అదానీ పై సమగ్ర విచారణ జరిపి అదానీ పై చర్యలు తీసుకోవాలని దేశాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అదానీ లాంటి వాళ్ళు దేశాన్ని దోచుకుని తింటుంటే కనీసం చీమ కుట్టినట్లైన లేదా అని మండిపడ్డారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదయ్యింది కానీ ఆ కేసు నేటికీ దర్యాప్తులో ముందుకు కదలడం లేదని తెలిపారు. విద్యుత్ ఒప్పందాల కోసం దాదాపు రూ.2100 కోట్లు మన దేశంలోని 4 రాష్ట్రాలలో అదానీ లంచాలుగా ఇచ్చినట్లు ఆరోపణలున్నాయనీ అన్నారు. ఇందులో అత్యధికభాగం రూ.1750 కోట్లు మన రాష్ట్రంలోనే గత ప్రభుత్వ హయాంలో ముడుపులుగా ముట్టజెప్పినట్లు తెలుస్తోందన్నారు. ఫలితంగా 25 సంవత్సరాలపాటు రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల రూపాయల మేర విద్యుత్ చార్జీల భారం మోపబడుతుందనీ తెలిపారు. మన రాష్ట్రంలో అదానీ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దుచేయాలని, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, ఈ అవినీతిపర్వంలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కూడా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. రంగరాజు, ఏఐటీ యూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదుగు రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు అప్పరుబోతు జగన్నాధం, సిపిఐ విజయనరం నియోజకవర్గ సభ్యులు ఎ. రాములు, సిపిఐ సభ్యులు పి. దబ్బు మార్కెట్ కార్మికులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

### అదానీ అవినీతి కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

**విశాలాంధ్ర-బొబ్బిలి :** అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి. కుంభకోణాలపై సమగ్ర విచారణ అలాగే క్రోనీ కాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో మోడీ ప్రభుత్వ పాత్ర పై సమగ్ర విచారణ నిర్వహించాలని ఇందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం పట్టణంలో ఉన్న జెండా మహల్ సెంటర్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుకోట అప్పన్న,సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ మన రాష్ట్రంలో అదాని అవినీతి కుంభకోణాల పైసమగ్ర విచారణ నిర్వహించాలని,గత ప్రభుత్వ హాయంలో ఆదానితో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అదానీ ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న అధిక ధరలను వెంటనే అరికట్టాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో అన్నదాతలు చేస్తున్న శాంతియుత ర్యాలీపై మోడీ ప్రభుత్వం భాష్ప వాయువు. జలవిరంగులతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లుతెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు వై బాబ్జి. కే సత్యనారాయణ. రాజు. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర-బొబ్బిలి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెవిన్యూ సదస్సులను సంబంధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ కే రామ్మోహన్రావు పిలుపునిచ్చారు. సోమవారం మండలం గోపాల రాయుడు పేట,ఎం వెలగవలస గ్రామాల్లో తహశీల్దార్ ఎం శ్రీను అధ్యక్షతన గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. రెవెన్యూ సదస్సుకు రైతుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ కే రామ్మోహన్రావు మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులో రైతుల నుండి వచ్చిన సమస్యల పైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం శ్రీను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్, మండల సర్వేయర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలకు ఏంటీ రాబిస్ టీకా, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు

**విశాలాంధ్ర-విజయనగరం అర్బన్:** నగరంలో కుక్కలను అదుపులోకి తీసుకొని ఏంటీ రాబిస్ టీకా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తున్న ప్రక్రియ కొనసాగుతోంది.విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రత్యేక సిబ్బంది వీధి కుక్కలను అదుపులోకి తీసుకుంటున్నారు.గత కొన్నాళ్ళుగా నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆయన స్పందించారు. ప్రత్యేక బృందాన్ని రప్పించి వారి ద్వారా వీధులలో ఉన్న వీధి కుక్కలను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. వాటిని కొత్తపేటలో ఉన్న డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్ కు తరలించి అక్కడ సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామన్నారు. అలాగే ఏంటీ రేబిస్ వ్యాక్సినేషన్ టీకాలను కూడా అందిస్తున్నామన్నారు. కుక్కల నుండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

## తోటపాలెంలో రెవెన్యూ సదస్సు

**విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ :** నగరంలోని తోటపాలెం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య,తహశీల్దార్ కూర్మనాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సు వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను అంతకుముందు పరిశీలించారు. సదస్సులో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని తాసిల్దార్ చదివి వినిపించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలనుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని చెప్పారు. ప్రతీఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

## ఘనంగా సోనియాగాంధీ 78వ పుట్టినరోజు వేడుకలు

**విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్:** కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ 78వ పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించారు. ఏ పీ సి సి అధ్యక్షులు షర్మిలారెడ్డి ఆదేశాల ప్రకారం విజయనగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ 78వ పుట్టినరోజు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించి విద్య ,వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి దేశాన్ని ముందుకు తీసుకువెళ్లిన ఘనత సోనియా గాంధీ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఏ. కరీం, బంగారు నాయుడు, ఏ. రెహమాన్, చంద్రశేఖర్, ఎస్కే. సమీర్, సి.హెచ్. అచ్చిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా.. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం : లోక్‌సత్తా

**విశాలాంధ్ర-బొబ్బిలి:** 2003 అక్టోబర్ 31వ తేదీన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం జరిగింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరగనున్న అవినీతి వ్యతిరేక కన్వెన్షన్ కోసం అడహాక్ కమిటీ రూపొందించిన తుది నివేదికను ఈ సమావేశంలో చర్చించి ఆమోదించారు. 2003 డిసెంబరు 9 నుండి 11వ తేదీ వరకు మెక్సికోలోని మెరిడాలో తుది సంతకాల కోసం అత్యున్నత స్థాయి రాజకీయ సమావేశం జరిగింది. ఇలా ఐక్యరాజ్య సమితి అవినీతి వ్యతిరేక కన్వెన్షన్ నివేదిక ఆచరణలోకి వచ్చింది. అందుచేత డిసెంబరు 9వ తేదీని అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి 58 బై 222 తీర్మానం ద్వారా ప్రకటించిందని,2004 డిసెంబరు 9 నుండి ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా పాటింపబడుతుందని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. అభివృద్ధికి అవినీతి ఒక పెద్ద అవరోధం, అలాగే మంచి పాలనకు కూడా అవినీతి అడ్డంకి అవుతుందని. ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థ పెంపొందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, సుపరిపాలన ప్రజలకు అందించాలన్నా అవినీతి అంతం చూడాలి. ప్రజల సొమ్ము అక్రమార్జన వరుల కాకూడదు. అవినీతి పరులు ప్రజల సొమ్ము దిగమింగి ఏ స్విస్ బ్యాంకుల్లో దాచేసినా లేక దేశంలోనే ఆస్తులు సంపాదించుకున్నా అలాంటి అక్రమ డబ్బును, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిని ప్రజల పరం చెయ్యాలని ఐక్యరాజ్య సమితి తీర్మానం పేర్కొంది. ప్రజల పన్నుల డబ్బు ప్రజోపయోగానికి ఖర్చు కావాలి. దానికి ఆయా వ్యవస్థలో అవినీతి ఉండకూడదు. అవి సంక్షేమ పథకాలే కావచ్చు, పౌర సేవలే కావచ్చు, కాంట్రాక్టులు, లైసెన్సులు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలే కావచ్చు. వీటిలో అవినీతి ఉండకూడదు. దానికి పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం మాత్రమే అవినీతికి విరుగుడు అని ఐక్యరాజ్య సమితి తీర్మానం చెప్పింది. ఐక్యరాజ్య సమితి రూపొందించిన అవినీతి వ్యతిరేక తీర్మానం పై 2003 లో మన దేశం సంతకం చేసింది. కాని ఆ తీర్మానం అమలుకు ఏడేళ్ళ పట్టింది. 2011 మే నెలలో పార్లమెంటు ఆమోదించిందని, ఈ అవినీతి కట్టడికి పౌరులుగా మన వంతు బాధ్యతను కూడా మనం నిర్వర్తించాలని,ప్రభుత్వ కార్యాలయాలలో మనకు కావలసిన సేవల కోసం లంచం ఇవ్వను అని గట్టిగా తీర్మానించు కోవాలి. లంచం ఇవ్వడం తీసుకోవడం రెండూ నేరమే. మన పిల్లలకి కూడా లంచం తీసుకోవడం వలన జరిగే అనర్థాల గురించి తెలియజేయాలని. ప్రభుత్వాలు కూడా అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని తక్షణమే వారిని విధుల నుండి తొలగించి వారు అక్రమంగా సంపాదించిన ఆస్తి మొత్తం ప్రభుత్వ పరం అయ్యేట్టుగా చర్యలు తీసుకోవాలని. ప్రతి పౌరుడు కూడా నేను అవినీతికి పాల్పడనని, ప్రోత్సహించనని, అవినీతి అంతం కోసం జరిగే అన్ని ప్రయత్నాలలో భాగస్వామిగా ఉంటానని గట్టిగా సంకల్పించినప్పుడే ఈ అవినీతి భూతాన్ని అరికట్టగలం అని దామోదర రావు అన్నారు.

## పురుగుల అన్నం పెడుతున్నా చర్యలేవి ?

- మెగా పేరుతో దగా మీటింగులు దేనికి...

-వైసీపీ నాయకుల ఆరోపణ....

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** మెగా పేరెంట్స్ డే మీటింగ్లు దగా కోరు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని చీపురుపల్లి మండల వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం వల్లి రెడ్డి శ్రీనివాస్ నాయుడు లు ఆరోపించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో వారు విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని గల బాలికల ఉన్నత పాఠశాలలో పురుగుల అన్నం పెడుతూ విద్యార్థుల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న పాలకులు నిర్వాహకులపై కనీస చర్యలు లేకుండా మెగా పేరెంట్స్ మీటింగ్ లో పేరుతో దగా సమావేశాలు దేనికి నిర్వహిస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న అధికారులు గాని పాలకులు గాని ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. తమ పార్టీ ఇటువంటి అకృత్యాలకు పాల్పడిన వారి పైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామన్నారు. కూటమి పాలనలో విద్యార్థుల భవిష్యత్తు మరింత నాశనం కానున్నదని ఈ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత బాటలు వేసిన జగనన్న పాలనకు ప్రస్తుత కూటమిపాలనకు తేడాలను విద్యార్థుల తల్లిదండ్రులు గమనిస్తున్నారు. వరి కోత ల సమయం కావడంతో ముమ్మరంగా పొలం పనుల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను బలవంతంగా మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలకు తరలించారని వారు ఆరోపించారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధనను, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టులలో టీచర్లను అందుబాటులో ఉంచడం లేదన్నారు. ప్రత్యేకించి అమ్మఒడి, విద్యార్థినిలకు అవసరమైన కిట్లను ఓటమి ప్రభుత్వం పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. జగనన్నపాలెంలో విద్యార్థుల భవిష్యత్తు కొరకు ఉన్నత బాటలు వేయగా ప్రస్తుత ప్రభుత్వం వాటిని విస్మరించింది అన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలు అందజేస్తూ వారి మనలను పొందవలసిన ప్రభుత్వం ఆరు నెలలకే ప్రజల నుండి వ్యతిరేకతను ఎదుర్కొనే దుస్థితి నెలకొంది అన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హులకు కూడా అందాయి అన్నారు. ఎంతో నమ్మకంతో ప్రజలు మీకు కట్టిన పట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి తప్ప ఆరు నెలలకే అసహ్యించుకునే పరిస్థితిని తీసుకురాకూడదని హితవు పలికారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ రాష్ట్రంలోనే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలోనే నాడు నేడు పథకంలో భాగంగా ప్రతి ఒక్క పాఠశాలను మౌలిక వసతులతోపాటు నూతన భవనాల నిర్మాణాలతో విద్యా వ్యవస్థను ప్రతిష్టం చేశామన్నారు. విద్యా వ్యవస్థ పై ఇదే నిర్లక్ష్యం కొనసాగితే, విద్యార్థుల భవిష్యత్తు కొరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పతివాడ రాజారావు, ఎంపీటీసీ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం విద్యార్థులు పథకాలు పట్టారు

**విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్:** విశాఖ సిటీ, గాజువాక లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో విజయనగరం విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ సోమవారం విడుదల చేసిన ప్రకటణలో విశాఖ సిటీ, గాజువాక ఎ.ఆర్.కన్వెన్సన్ హాల్ లో ఆదివారం ఒక్కరోజు జరిగిన ఎ.పి. స్టేట్ ఇన్విటేషనల్ 18వ కెన్యూర్యూ, కరాటే ఛాంపియన్షిప్ -2024 పోటీలలో ఈ పతకాలు లభించాయి. సబ్ జూనియర్స్ విభాగం లో బి.శివశ్రీ హర్ష కాటాలో కాంశ్య, కుమిటీలో బంగారు పతకం సాధించగా కె. శివగణేష్ కు కాటాలో వెండి, కుమిటీలో బంగారు పతకం లభించింది. కె.మోహన్ చంద్రకు కాటాలో వెండి. వి.హర్షవర్ధన్ కు కాటాలో కాంశ్య, కుమిటీలో వెండి పతకం లభించింది. ఎస్. కార్తీక్ కు కాటా, కుమిటీలో కాంశ్య పతకాన్ని కైవశం చేసుకున్నాడు. కె.స్నేహ కాటా, కుమిటీలో కాంశ్య, వి.చేతన్ నాయుడుకు కాటా, కుమిటీలో కాంశ్య, వి.చేతస్ ఆనంద్ సుహాష్ కు కాటాలో కాంశ్య వతకం లభించింది. ఎం.సాత్విక్ కు కాటాలో కాంశ్యం లభించింది. జూనైయర్స్ విభాగంలో" ఎల్.జశ్వంతి కాటా, కమిటీలో కాంశ్య పతకాన్ని సాధించాడు. కేడెట్ విభాగంలో ఎ. హేమంత్, కాటా, కుమిటీలో బంగారు పతకాలు లభించాయి. ఎం. హర్షవర్ధన్ కు కాటాలోలో బంగారు, కుమిటీలో కాంశ్యవతకాలు లభించాయి. బి.షణ్ముక్ శ్రీకర్ కాటాలో కాంశ్య, కుమిటీలో వెండి తకాలను కైవశం చేసుకున్నాడు. బి.రేశ్వంత్ కాటాలో కాంశ్య, కుమిటీలో వెండి పతకాన్ని సాధించాడు. ఆర్.గణేష్ కాటాలో కాంశ్య పతకాన్ని సాధించాడు. వీరికి సంస్థ ఎ.పి. ప్రెసిడెంట్ కె. సుమన్, సెక్రటరీ ఆర్.ఢిల్లీశ్వ రరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ శివ కుమార్, కోచ్ కె. సంతోష్ కుమార్ ల చేతుల మీదుగా పతకాలను, సర్టిఫికేట్లను అందజేశారు.

## పోలీస్ స్టేషను తనిఖీ చేసిన డీఎస్పీ

**విశాలాంధ్ర-గుర్ల:** గుర్ల పోలీస్ స్టేషను చీపురుపల్లి డీఎస్పీ ఎస్. రాఘవులు వార్షిక తనిఖీ భాగంలో సోమవారం పోలీస్ స్టేషను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ పరిసరాలు పరిశీలించి. మొక్కలు నాటారు రికార్డులు తనిఖీ చేశారు. నేర నియంత్రణకు తగుచూచనలను ఇచ్చి, సైబర్ నేరాలు నివారణ, గంజాయి నివారణకు సూచన చేశారు. శాంతి భద్రతలు పరిరక్షణపై గుర్ల పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచన చేశారు. వీరితోపాటు సిఐ శంకర్రావు, ఎస్సై పి. నారాయణరావు తదితరులు ఉన్నారు.

## గర్బిణీలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు

**విశాలాంధ్ర-జామి:** మండల కేంద్రమైన జామిలోని పిహెచ్‌సిలో నెలవారీ తనిఖీలకు వచ్చే గర్భిణీలకు మద్యాహ్నం సమయంలో ఇబ్బంది కలుగకుండా ఉచితంగా భోజన వసతిని కల్పించారు. సోమవారం ఆసుపత్రిలో తనిఖీకి వచ్చిన గర్భిణీలకు, వారి సహాయకులకు, ఆరోగ్య సిబ్బందికి బాదిరెడ్డి శ్రీధర్, జ్యోతి దంపతులు భోజన ఏర్పాట్లు చేసారు. దాదాపు వందమందికి పైగా భోజనాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో భోజనాలను దంపతులతోపాటు ఆసుపత్రి వైద్యాధికారిణి డా. సామ్రాజ్య లక్ష్మి, శ్రీసత్యసాయి భజన మండలికి చెందిన విన్నకోట నానాజీ, నార్లమహంతి నారాయణరావు తదితరుల చేతుల మీదుగా గర్భిణీలకు వడ్డించారు. ప్రతీ నెలా దాతల సహకారంతో భోజన వసతి కల్పిస్తున్నందుకు వైద్యాధికారిణి కృతజ్ఞతలు తెలిపారు.

## మాధవ సేవగా... సర్వ ప్రాణికీ సేవచేయాలి

### త్రిదండి చిన జీయరు స్వామి

**విశాలాంధ్ర-భోగాపురం:** ఈ చరాచర జగత్తులో సర్వప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని త్రిదండి చిన జీయరు స్వామి అన్నారు. జనసేన నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మిరకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పారిశ్రామికీకరణ పేరుతా సర్వం నాశనం చేసుకుని ప్రకృతికి దూరంగా వచ్చేశామని, ఇప్పుడు వాటి ఫలితంగా అనేక జబ్బులు, ప్రకృతి వైపరీత్యాలతో బాధపడుతున్నామని అన్నారు. వినాశనం నుంచి వికాసానికి తీసుకెళ్లగలిగేదే విద్య అని, అలాంటి విద్యను అందరు ఔపాసన పట్టాలని సూచించారు. అభివృద్ధి పేరుతా మనిషి ఈ భూమి మీద ఉన్న అన్ని ప్రాణుల పైన ఎన్నో అఘాయిత్యాలు చేసాడని ఆవేదన చెందారు. ఈ భూమి మీద అన్ని ప్రాణులకు వాటి పరిధిలో యథేచ్ఛగా జీవించే హక్కు కల్పించాలన్నారు. ఈ సృష్టిలో దేనిని మనము సృష్టించ లేదని అందువల్ల ఏ ప్రాణిని చంపే హక్కు మనకు లేదని ఉద్ఘాటించారు. ఈ ప్రపంచం మొత్తం మాధవుడు సృష్టి అని సర్వ ప్రాణి సేవ చేస్తేనే మాధవ సేవ చేసినట్టని ప్రవచించారు. అలాగే మారుమూల గ్రామీణ ప్రాంతంలో చక్కని ప్రకృతి ఒడిలో మిరకిల్ లాంటి సంస్థను స్థాపించి అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందిస్తున్న లోకం మాధవి, ప్రసాద్ దంపతులను అభినందించి మంగళాశాసనాలు అందించారు. భారతదేశం మొత్తం మీద ఎక్కడ ఏ ఉపద్రవం సంభవించినా అనేక మంది వాలెంటీర్ల ద్వారా బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే "వికాస తరంగిణి" ద్వారా దేశ వ్యాప్తంగా 36 లక్షలు మంది మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ ప్రాంతంలో కూడా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేపట్టడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే లోకక మాధవిని కోరారు. జీయరు స్వామి కోరినట్టుగా ఆయన సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ రహితంగా నెలిమర్ల నియోజకవర్గంగా మారుస్తామని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు. కోరిన వెంటనే వచ్చి విద్యార్థులకు హితోపదేశం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని అందరి తరపున కాకర్లపూడి శ్రీనివాసరాజు జీయరు స్వామికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజాంలో సోనియా జన్మదిన వేడుకలు

**విశాలాంధ్ర-రాజాం:** ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కుప్పిలి చైతన్యకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ సంతోషి మనోవికాశ దివ్యాంగుల పాఠశాలలో పిల్లలకు ఫ్రూట్స్, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేసారు.

## ఆన్‌లైన్లో డ్వాక్రా గ్రూప్ సభ్యుల వివరాల నమోదు

**విశాలాంధ్ర-రాజాం:** రాజాం మున్సిపాలిటీలో డ్వాక్రా గ్రూప్ సభ్యుల వివరాలు ఆన్లైన్ నమోదు చురుకుగా జరుగుతోంది. మెప్మా అధికారిణి ఎంవి రత్నం ఆధ్వర్యంలో సిఓ ల పర్యవేక్షణలో, ఆర్పీలు ప్రతీ గ్రూప్ సభ్యురాలు, గ్రూప్ వివరాలు ఆన్లైన్ లో పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు ఎస్ హెచ్ సభ్యుల వివరాలు కేవలం ఆన్లైన్ లో ఉండేవి. ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న వివరాలతోపాటు, ఆర్పీలు ప్రతీ గ్రూప్ సభ్యురాలికి చెందిన డేటా ను ప్రత్యేకంగా రూపొందించిన పత్రంలో నమోదు చేస్తున్నారు. పేరు, అడ్రస్, మొబైల్ నెంబరు, బ్యాంకు నుంచి, సంఘం నుంచి తీసుకున్న రుణం, పొదుపు, ఇంటర్నల్ రుణాలు, తిరిగి చెల్లింపులు, ప్రభుత్వ పథకాల అమలు, ఇతర వివరాలు తదితరమైనవి సేకరిస్తున్నారు. రాజాల మున్సిపాలిటీలో 876 గ్రూప్ లు ఉన్నాయని, వాటిలో 9059 మంది సభ్యులు ఉన్నారన్నారు. వారిలో ఇప్పటి వరకు 7673 మంది డేటా ఆన్లైన్ లో పొందుపరచడం జరిగిందని మెప్మా అధికారిణి తెలిపారు. మిగిలిన వారి డేటా కూడా సేకరిస్తున్నామని చెప్పారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కావలి గ్రీష్మ

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షులు కావలి గ్రీష్మ సోమవారంమహిళా ప్రాంగణాన్ని సందర్శించారు.ప్రాంగణం లో శిక్షణ పొందిన మహిళలతో మాట్లాడుతూ ఏఏ విభాగాల్లో శిక్షణ పొందారని అడిగితెలుసుకున్నారు.శిక్షణ అనంతరం మహిళలు తయారుచేసిన మగ్గం డిజైన్స్ ని చూసి సంతృప్తి చెందారు. శిక్షణ పూర్తిచేసిన మహిళలకు తదుపరి ఉన్నత శిక్షణ కొరకు ప్రతిపాదనలు చేస్తానని తెలిపారు.ఈ ప్రభుత్వం మహిళాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తుందని మహిళలు ఆత్మవిశ్వాసం తో అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతున్నారని ఈ సందర్భం గా కొనియాడారు. అనంతరం బ్యూటీషియన్,మగ్గం వర్క్ మరియు టైలరింగ్ లో శిక్షణ పొందిన 90 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం లో జిల్లా మహిళా సహకార సంస్థ మేనేజర్ పి.విమల,కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. ..

## మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : రూరల్ సీఐ ఉపేంద్ర



**విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం:** సంతకవిటి మండలం గోళ్లవలస గ్రామంలో మత్తు పదార్థాలు, గంజాయి, వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ ఫ్రాడ్స్ పై రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో సంతకవిటి ఎస్సై గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమావేశం

### ముఖ్యఅతిథిలుగా ఎంపీపీ, జడ్పిటిసి సభ్యులు

**విశాలాంధ్ర-వేపాడ :** మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడు పేటలో గల ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షులు దోగ్గ సత్యవంతుడు,జెడ్పిటిసి శానాపతి అప్పారావులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని రానున్న రోజుల్లో మన ప్రాంతానికి, కన్న తల్లిదండ్రులకు,చదువు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలనిసూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును, తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని,తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన పట్ల శ్రద్ధ వహించి నైతిక విలువలు తెలిసే విధంగా చేయాలన్నారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలతో పాటు బాలికల ఆశ్రమ పాఠశాలలో కూడా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రోత్సాహ బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో వేపాడ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ రమణ, ఉప సర్పంచ్ సబ్బి లక్ష్మి అప్పారావు,ఆయా పాఠశాలల చైర్మన్లు కమిటీ సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పిల్లలు ఆయా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై లారీ క్లీనర్ సజీవ దహనం

**విశాలాంధ్ర-భోగాపురం :** జాతీయ రహదారిపై ఇసుక లారీ ని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టి కొట్టడంతో వ్యాను నుంచి ఒక్క సారిగా మంటలు చెలరేగి వ్యాన్ క్లీనర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యాడు. జాతీయ రహదారిపై భోగాపురం సమీపంలో నారు పేట పెట్రోల్ బంకు వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ నారు పేట వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ఇసుక లారీ ని ఢీ కొట్టింది. దీంతో వ్యాన్లో ఒకసారిగా మంటలు చెలరేగాయి. ఢీకొట్టిన సమయంలో వ్యాన్లో చిక్కుకున్న క్లీనర్ బయటికి రాలేకపోవడంతో సజీవ దహనం అయ్యాడు. సిఐ ప్రభాకర్, ఎస్సై లు పాపారావు, సూర్య కుమారి, హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని జాతీయ రహదారిపై ట్రాఫిక్ ను నియంత్రించారు. గాయపడిన వ్యాన్ డ్రైవర్ ను ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాపు చేసున్నారు.

## తారు రోడ్డుకి గుంతలు పూడ్చిన క్రషర్ యాజమాన్యం

### విశాలాంధ్ర వార్తకు స్పందన



**విశాలాంధ్ర-వేపాడ :** మండలంలోని వావిలపాడు గ్రామ సమీపంలో మైనింగ్ రాయల్టీ చెక్ పోస్ట్ నుండి రైవాడ కాలువ వరకు గల తారురోడ్డు గుంతల మయంగా మారడంతో వాహనాచోధకులు నానా అవస్థలు పడేవారు.ఈ మేరకు అధిక లోడ్లతో లారీలు రవాణా - గుంతల మాయంగా తారు రోడ్డు అనే శీర్షిక విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన వార్తకు రాతి క్రసర్ల యజమానులు స్పందించి,ఆదివారం రాత్రి క్రసర్లలో గల రాతి బుగ్గితో తారు రోడ్డు గుంతలను పూర్చారు. అయితే వావిలపాడు గ్రామంలో సుమారు ఐదు క్రషర్ లు ఉన్నప్పటికీ పంతులు గారి క్రషర్ నుండి సర్వాణి యాజమాన్యం ఒకే ఒక క్రసర్ యజమాని స్పందించి తారు రోడ్డు గుంతలు పూడ్చారు. మిగతా రాతి క్రసర్ల యజమానులు అందులోనూ ప్రముఖ వ్యాపారం చేస్తున్న ఎస్.కే.సి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం స్పందించక పోవడంప్తే గ్రామస్తులు విస్మయాని సంధిస్తున్నారు. ఎస్.కే.సి రాతి క్రషర్ నుండి అధిక లోడ్లతో రవాణ చేయడం వలనే ఈ తారు రోడ్డు గుంతలు పడిందని గ్రామస్తులు, మండిపడుతున్నారు.ఏది ఏమైనా తారు రోడ్డుకు గుంతలు పూడ్చడంతో గ్రామస్తులతో పాటు వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలకు టీబి వ్యాధి పట్ల అవగాహన అవసరం

**విశాలాంధ్ర-గుర్ల:** తెట్టంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో తెట్టంగి గ్రామంలో 100 రోజుల ప్రచారంలో డిసెంబర్ 7 నుండి మార్చ్ 23 జాతీయ క్షయరోగ నిర్మూలన కార్యక్రమంలో నేషనల్ రుబెర్కులోసి ఎలిమినేషన్ ప్రోగ్రామ్ భాగంగా తెట్టంగి గ్రామంలో జరిగింది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ టీ.బి వ్యాధి పట్ల ప్రజలంతా అగవాహన కలిగి ఉండాలని, అది రాకుండా శ్రద్ధ తీసుకోవాలని టీ.బి రహిత భారత్ కు సహకరించాలని వైద్యాధికారి కోరారు. కార్యక్రమంలో వైద్యాధికా సిబ్బంది, స్థానిక నాయకులు మండల పార్టీ అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, జమ్ము లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## 20 నిమిషాలలో ఎఫ్ఎంసి మంజూరు

**విశాలాంధ్ర-తెర్లాం:** మండలం లో ఆమిటి గ్రామానికి చెందిన రెడ్డి నారాయణమ్మ భర్త 30-01-2023 న మరణించగా ఆమె తహసీల్దార్ ఆఫీస్ ను సప్రదించి ఏప్రిల్2024న ఎఫ్ఎంసి ( ఫ్రీ ఆఫ్ కాస్ట్) ను పొందడం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఆమె ఆమిటి గ్రామ సచివాలయం లో జరిగిన రెవెన్యూ సదస్సులలో ఎఫ్ ఎం సి మరోసారి దరఖాస్తు చేసారు. అనంతరం ఎంక్వైరీ చేసి గ్రామ సభ ఎఫ్ఎంసి ను 20 నిమిషాల లో మంజూరు చేశారు అని తహ సీల్దార్ హేమంత్ కుమార్ తెలిపారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

### పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గేదెల తిరుపతి

**విశాలాంధ్ర శృంగవరపుకోట :** ఎస్.కోట సుబ్బిరామరెడ్డి కళ్యాణ్ మండపం లో జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ 78వ జన్మదిన శుభాకాంక్షలు వేడుకలు ఘనంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గేదెల తిరువతి నేతృత్వంలో నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పదాల మణిబాబు హెచ్ నానాజీ మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లాగిన్ లో చూడకుండా ఉన్న వినతులు వెంటనే చూడాలి

- పిజిఆర్ఎస్ కు 94 వినతులు
- రెవిన్యూ సదస్సులలో సేవల కోసం అందిన దరఖాస్తులు వెంటనే పరిష్కారం కావాలి
- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని, ఇంకనూ చూడవలసిన కాలం లో ఎప్పుడు చూసినా సున్నా కనవడాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు ఇంకనూ ఉన్నాయని, అవి సోమవారం సాయంత్రానికి సున్నగా ఉండాలన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, ఇంకా చూడనివి సైట్ లో ఉండకూడదని, అలాగే రీ ఓపెన్ కేసు లు కూడా ఉండకూడదని, వచ్చే సోమవారం నాటికి ఏ శాఖ వద్ద పెండింగ్ వినతులు ఉండకూడదని, అన్నిటిని పరిష్కరించాలని తెలిపారు. సరియైన సమాధానాలు రాసి రీ ఓపెన్ కేసు లు రాకుండా చూడాలన్నారు . గంట గంటకు పిజిఆర్ఎస్ పెండింగ్ వివరాలను మోనిటర్ చేయాలనీ డి.ఆర్.ఓ కు కలెక్టర్ ఆదేశించారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 94 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ , జేసి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 94 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 43 , వినతులు అందాయి. పంచాయతి రాజ్ కు 10 , పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 25 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 06, విద్యా శాఖకు 06 అందగా , వైద్య శాఖకు 03, విద్యుత్ శాఖకు 01 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

**కోర్ట్ లలో ఫైల్ అయిన కేసులకు వెంటనే స్పందించాలి:** హై కోర్ట్, జిల్లా కోర్ట్ లలో ఫైల్ అయిన కేసులను కోర్ట్ వెబ్సైటు లో ప్రతి రోజు తనిఖీ చేయాలనీ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లాకు సంబంధించి రెవిన్యూ, ఇతర శాఖలకు చెందిన కేసులేమైనా నమోదైనవా , కోర్ట్ ఆర్డర్స్ పద్దయా అనే విషయాలను తనిఖీ వెంటనే నోడల్ అధికారి పంపడం జరుగుతుందని తెలిపారు. అలాగే సంబంధిత జి.పి కు 24 గంటల్లో ఇన్ స్ట్రక్షన్ ను పంపించి కాపీ ను కలెక్టర్ కు పంపాలని తెలిపారు. కోర్ట్ ఆర్డర్స్ పడితే సంబంధిత అధికారులతో వెంటనే కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలని, కంటెంప్ట్ కు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. ప్రతి శనివారం జిల్లా మొత్తం కేసుల వివరాలను తనకు సమర్పించాలని, సోమవారం పిజిఆర్ఎస్ లో హెచ్.ఓ.డిల తో కేసుల పై సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. కోర్ట్ కేసుల పట్ల ప్రతి అధికారి అవగాహన కలిగి అప్రమతంగా ఉండాలని తెలిపారు.

### రెవిన్యూ సదస్సులలో సేవల కోసం అందిన దరఖాస్తులు వెంటనే పరిష్కారం కావాలి

ప్రస్తుతం జిల్లా అంతటా జరుగుతున్న రెవిన్యూ సదస్సులలో సేవల కోసం అందిన దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు సాయంత్రానికి ఎన్ని దరఖాస్తులు అందాయి , ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారో నివేదిక నివ్వాలని సూచించారు. జేసి , డి.ఆర్.ఓ మోనిటర్ చేయాలనీ తెలిపారు.

## రాష్ట్రస్థాయి యోగాలో పదో ర్యాంకు సాధించిన కస్తూరి విద్యార్థిని

**విశాలాంధ్ర - గుర్ల :** రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో గుర్ల కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు శ్రావణి యోగ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించింది. విజయవాడలో జరిగిన ఈ పోటీలలో గొర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతిచదువుతున్న విద్యార్థి శ్రావణి ఎంపికైనట్లు తెలిపారు గురుకుల పాఠశా లలో ఉదయం నుంచి యోగా ఏర్పాటు ఉంటుందని జిల్లా స్థాయిలో గుర్ల ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు యోగ నేర్పించడం ఇక్కడ ఒక ప్రత్యేకమైన విద్యగా ఆమె కొనియాడారు.

## సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

**విశాలాంధ్ర-గుర్ల:** సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి అన్నారు మండలంలో రెవెన్యూ సదస్సులో భాగంగా కొండగండ్రేడు గ్రామం లో ఆమె గ్రామ సభలో పాల్గొన్నారు రైతులు తమ ప్రతి భూ సమస్యలను తమ దృష్టి తీసుకురావాలన్నారు అదే విధంగా రెవిన్యూ సమస్యలు కూడా ఏదైనా ఉంటే తమ దృష్టికి వస్తే పరిష్కరించే మార్గాలను అధికారులు చూస్తారన్నారు రీసర్వే వలన కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించే మార్గాలను చూస్తున్నామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సారికి గోవింద్ తదితరులు పాల్గొన్నారు. ..

## తొలగించిన అంగన్వాడీ హెల్పర్ సౌజన్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**విశాలాంధ్ర-విజయనగరం రూరల్:** తొలగించిన అంగన్వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని . ఐసిడిఎస్ పిడి, పిఓల పైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన రిలే నిరాహార దీక్ష లను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్ గారు ప్రారంభించారు. గజపతినగరం ప్రాజెక్టు, గజపతినగరం మండలం, రామన్నపేట గ్రామంలో అంగన్వాడీ హెల్పర్ గా 2022 లో ఉద్యోగం కల్పించారని అప్పటినుంచి ఎటువంటి రిమార్క్ లేకుండా పనిచేస్తున్నప్పటికీ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామన్నపేట గ్రామ సర్పంచ్ అమ్మగారు చేసిన రాజకీయ వేధింపులో భాగంగా సౌజన్యని తొలగించాలని ఐసిడిఎస్ పిఓపైన ఒత్తిడి తీసుకురావడం జరిగిందన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని గజపతి నగరం నియోజవర్గం ఎమ్మెల్యే , సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు దృష్టికి అంగన్వాడీ యూనియన్ గా సమస్యను తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయిన తన తప్పుడు సర్టిఫికెట్లు పెట్టిందని శనివారం తొలగించడం అన్యాయం అన్నారు. సౌజన్యకు ఉద్యోగం ఇచ్చినప్పుడు ఇప్పుడున్న ఐసిడిఎస్ పిడి శాంత కుమారి , సిడిపిఓ గజపతినగరం ప్రాజెక్ట్ నాగమణి ఒక కమిటీ పరిశీలించి ఉద్యోగం ఇవ్వడం జరిగిందన్నారు. అప్పుడు సౌజన్య సర్టిఫికెట్లు సక్రమమైనప్పుడు నేడు అక్రమం ఎలా అవుతాయని ప్రశ్నించారు? కావాలని రాజకీయ వేధింపుల్లో భాగంగానే తొలగించడం జరిగిందని తెలియజేశారు కావున మంత్రి స్పందించి సౌజన్యని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పిడి, సిడిపిఓ ల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్, మానాపురం సౌజన్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి. పైడిరాజు జిల్లా కమిటీ సభ్యులు పి కుమారి, హైమా, ఏ రోజ,, శ్యామల, కే తులసి, ఆర్ శంకరావతి తదితరులు పాల్గొన్నారు.

## 12న నెల్లిమర్ల కళాశాలలో డెమోకమ్ వాక్ఇన్ ఇంటర్వ్యూ

### జిల్లా సమన్వయకర్త టీఎం ఫ్లొరెన్స్

**విశాలాంధ్ర-వేపాడ :** విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడపబడుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ వృత్తిలో పార్ట్ టైం ప్రాతిపాదికన పనిచేయుటకు ఈ నెల12న విజయనగరం జిల్లా నెల్లిమర్లలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డెమో కమ్ వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడినని జిల్లా సమన్వయకర్త టీ.ఎం.ఫ్లొరెన్స్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ మహిళా అభ్యర్థులకు,వేపాడ, వియ్యంపేట, నెల్లిమర్లలో గల గురుకుల పాఠశాలలో గణితం సబ్జెక్టు, అలాగే భామినిలో ఫిజికల్ సైన్సు, బయో సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులకు,అలాగే నెల్లిమర్లలో సివిక్స్ సబ్జెక్టులకు ఉపాధ్యా యులు కావలసి ఉందన్నారు.అలాగే పురుష అభ్యర్థులకు కొప్పెర్లలో బయాలజీ సబ్జెక్టులకు ఖాళీ కలవన్నారు.ఈ ఉద్యోగాలకు సంబంధించి పీజీ 55 శాతం తక్కువ కాకుండా,సంబంధిత సబ్జెక్టులలో మెథడాలజీతో బిఎడ్ మరియు సంబంధిత సబ్జెక్టులలో టెట్ పేపర్ టు అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హత ఉండి ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమోకమ్ వాక్ఇన్ ఇంటర్వ్యూకు 11గంటలకు హాజరు అవ్వాలని ఆమె కోరారు.అలాగే ఇందుకు సంబంధించిన వివరాలు కొరకు దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లేదా విజయనగరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

## జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యా కుసుమం

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ప్రతిష్టాత్మక శ్రీ చైతన్య విద్యాసంస్థ. విద్యార్థిని ధనుకొండ శ్రీనిధి. జేఈఈ మెయిన్స్ లో టాపర్గా నిలిచి ఆదర్శంగా నిలిచిందని శ్రీ చైతన్య విద్యాసంస్థ జిఎం నాగేంద్ర , ఏజీఎం సురేష్ , శ్రీ చైతన్య విజయనగరం బ్రాంచ్ ప్రాంతీయ పర్యవేక్షకులు వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వీరి చేతుల మీదుగా షీల్డు, ప్రశంసా పత్రాన్ని అందుకోవడం జరిగినది. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ శ్రీనిధి ని జేఈఈ మెయిన్స్లో విజేతగా నిలవడం ఎంతో సంతోషదాయకమని ఈ విద్యార్థిని విజయనగరం బ్రాంచ్ నందు పదవ తరగతి పూర్తి చేసిందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఆ చిన్నారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శ్రీనిధి ని పాఠశాల డీన్లు, ఇన్చార్జిలు, ఉపాధ్యాయ వర్గము అభినందించారు. ..

## మాదక ద్రవ్యాల నియంత్రణకు

# సంకల్ప రధంతో ప్రచారం

### జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలను యువతకు వివరించి, వారిని మాదక ద్రవ్యాల అలవాటుకు దూరంచేసేందుకు జిలా ఎస్పీ వకుల్ జిందల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసుశాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమానికి యువత నుండి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. ఈ 'సంకల్పం' కార్యక్రమాన్ని యువతతోపాటు డ్రగ్స్ అలవాటు ఉన్న ఇతర వ్యక్తులు, ప్రజలకు మరింత చేరువ చేసి, వారిని అలవాట్లకు దూరం చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంకల్పించి ప్రత్యేకంగా 'సంకల్ప రథం' ను రూపొందించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సంకల్ప రథంతో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొని వచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ సాయంత్రం ఒక ముఖ్య కూడలిలో వాహనాన్ని నిలిపి, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించనున్నామన్నారు. ప్రజలకు సంకల్పం కార్యక్రమ ఉద్దేశ్యాన్ని తెలియపర్చి, మత్తు, మాదక ద్రవ్యాల అలవాటుకు ప్రజలను దూరం చేసేందుకు అవగాహన కల్పించడమే ప్రధానమని జిల్లా ఎస్పీ భావించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలును సందర్శించి, విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ, వారిని ఆలోచింపజేసే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శించి, మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతున్నారు. ఇదే విధంగా విద్యార్థులతోపాటు ప్రజలను కూడా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చైతన్యపర్చేందుకు 'సంకల్ప రథం'ను పట్టణంలోని తోటపాలెం కళాశాల వద్ద నిలిపి, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను, మాదక ద్రవ్యాల వినియోగం వలన తమ జీవితాలు, కుటుంబాలు ఏవిధంగా చిత్రం అవుతున్నాయో వివరిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శించి, ప్రజలు, యువతకు అవగాహన కల్పించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు ప్రసన్న కుమార్, కిరణ్ కుమార్ నాయుడు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 100 రోజుల టీ. బి అవగాహన

**విశాలాంధ్ర-దత్తిరాజేరు :** మండల పరిధిలో గల ఇంగిలాపల్లి గ్రామంలో డాక్టర్ కె.రఘు వైద్యాధికారి ఆధ్వర్యంలో వందరోజుల టి.బి అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు టీ.బి వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం బరువు తగ్గడం చాతిలో నొప్పి రావడం కపంలో రక్తం కనిపించడం జరుగుతుందని అన్నారు. మరియు ఎవరైతే లక్షణాలతో కలిగి ఉన్నారు వారందరికీ 25 కపం పరీక్షలు చేయడం జరిగిందని మరియు గ్రామ ప్రజల చేత టీబీ వ్యాధి అవగాహన పట్ల ప్రతిజ్ఞ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి డి.వి. గిరిబాబు హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్. శ్రీనివాసరావు హెల్త్ సూపర్వైజర్, జి .రాము హెల్త్ సూపర్వైజర్, ఎం ప్రసన్నకుమార్ సిహెచ్ఓ, ఆర్. ఈశ్వరమ్మ ఏ.ఎన్.ఎం, డి రామకృష్ణ ,పి కుమారి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## సత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో యన్ సి సి క్యాడేట్స్ తో ఆర్మీ పతాక దినోత్సవ ఫండ్ కలెక్షన్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో ఆర్మీ పతాక దినోత్సవ సందర్భంగా యన్ సి సి క్యాడట్స్ ఫండ్ కలెక్షన్ చేయటం జరిగింది. కళాశాల యాజమాన్యం, వివిధ విభాగాదిపతులు , స్టాఫ్, స్టూడెంట్స్ సహాయానిదికి తమ వంతు విరాళాన్ని అందించార. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ దేశరక్షణ కు కృషి చేసిన సైనిక దళాలకు విరాళాలు సేకరించటం నేటి యువత భాద్యత అని కొనియాడారు. సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి మాట్లాడుతూ ఆర్మీ పతాక నిధికి ప్రతి సంవత్సరం తమ వంతు సహాయం యన్ సి సి క్యాడట్స్ తో చేయించి జిల్లా సైనిక ఆఫీస్ కి అందిచటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సత్య ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్ సాయిదేవమని మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా తమ వంతు విరాళాలు అందచేస్తున్న అందరికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమం లో కళాశాలాల ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాధిపతులు యన్ సి సి ఆఫీసర్స్ కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, కె సత్యనారాయణ, యన్ సి సి క్యాడట్స్ పాల్గొన్నారు.